# మరో కురుక్షేత్రం

MAROKURUKSHETRAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

సంపుటి : 1 | సంచిక : 147 | హైదరాబాద్ | 14-06-2025 | శనివారం | ఎడిటర్ : డా॥ షేక్ ఇస్లాముద్దిన్ | పేజీలు : 4 | వెల : రూ.3/-

VOLUME NO.1 | ISSUE NO. 147 | HYDERABAD | 14.06.2025 | SATURDAY | EDITOR : Dr. SHAIK ISLAMUDDIN | PAGES. 4 | RATE. RS.3.00.


## తెలంగాణకు.... భారీ వర్ష సూచన

**మరో కురుక్షేత్రం, హైదరాబాద్:**

వాతావరణ శాఖ తాజా నివేదిక ప్రకారం, శుక్రవారం నాడు ఉమ్మడి మహబూబ్‌నగర్, నిజామాబాద్, మెదక్, నల్గొండ, వికారాబాద్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరిక జారీ చేసింది. ఈ వర్షాలు సముద్ర మేఘాలు, తూర్పు దిక్కున వాయుగుండాల ప్రభావంతో ఏర్పడుతున్నాయని అధికారులు తెలిపారు. వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశముండటంతో గ్రామీణ ప్రాంతాల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా పంటల పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉండటంతో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారుల సూచించారు.

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో కూడ ఈ వాతావరణ పరిస్థితుల ప్రభావం స్పష్టంగా కనిపించనుంది. ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది. నగరంలోని లోతట్టు ప్రాంతాలు, తక్కువ ముడతలు గల రోడ్లపై నీటిముట్టడి సమస్యలు తలెత్తే అవకాశం ఉండటంతో నగరపాలక సంస్థ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించబడింది. అదే విధంగా, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి పోలీస్ శాఖ కూడా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని అధికారులు వెల్లడించారు.



**ఉష్ణోగ్రతలు పడిపోవచ్చు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

వర్షాల ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. దీంతో రోగనిరోధక శక్తి తగ్గిపోయే పరిస్థితులు ఏర్పడొచ్చని ఆరోగ్య శాఖ సూచిస్తోంది. వృద్ధులు, చిన్న పిల్లలు, శ్వాసకోశ సమస్యలున్న వారు వాతావరణ మార్పులకు అనుగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తేమ ఎక్కువగా ఉన్న వాతావరణంలో వైరల్ వ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశముండటంతో శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఇంట్లోనూ బయటనూ మాస్క్ ధరించడం, చేతులు కడగడం లాంటి చర్యలు పాటించాల్సిన అవసరం ఉంది.

**పిడుగుల ప్రమాదం.. చెట్ల కింద తలదాచుకోవద్దు**

వర్షాల సమయంలో పిడుగుల ప్రమాదం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రజలు ఏవైనా చెట్ల కింద, టెలికమ్యూనికేషన్ టవర్లు, విద్యుత్ స్తంభాల దగ్గర నిలబడకుండా సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించారు. పల్లెటూర్లలో ఈ ప్రమాదం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున గ్రామస్థులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచన. మొబైల్ ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు వాడకూడదని, వర్షం పడుతున్న సమయం లో ఇంట్లో ఉండటం ఉత్తమమని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు.

**ప్రభుత్వ యంత్రాంగం అలెర్ట్ స్థితిలో ఉండాలి**

ఇలాంటి విపత్కర వాతావరణ పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాంగం తగిన సమయానికి స్పందించేలా ఏర్పాట్లు చేసుకోవాలి. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, పురపాలక శాఖల సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో కార్యాచరణ జాబితా సిద్ధం చేయాలని, అవసరమైతే రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించే విధంగా, గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో సమాచారాన్ని పంచాలి.

## మంత్రుల బాధ్యతల్లో మార్పులు

### వారికి తొలిగింపు - రేవంత్ నిర్ణయం వెనుక..!!



**మరో కురుక్షేత్రం, హైదరాబాద్:**

తెలంగాణ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. ముగ్గురు కొత్త మంత్రులు బాధ్యతలు స్వీక రించారు. వారికి శాఖలు కేటాయించారు. ఢిల్లీలో కీలక మంత్రాంగం తరువాత వరుసగా కీలక నిర్ణ యాలు తీసుకుంటున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దిశగా అడుగులు వేస్తున్నారు. ఇక, తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ జిల్లా ఇంఛార్జ్ మంత్రుల బాధ్యతల్లోనూ కీలక మార్పు లు చేసారు. కొత్త మంత్రులకు అవకాశం కల్పిస్తూ.. పాత వారిలో ముగ్గురిని ఈ బాధ్యతల నుంచి తప్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ పాలనా పరంగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా ఇన్‌చార్జి మంత్రుల బాధ్యతల్లో మార్పులు చేర్పులు చేసింది. కొత్త మంత్రులకు జిల్లా ఇన్ చార్జి బాధ్యతలు అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన గడ్డం వివేక్ వెంకటస్వామికి మెదక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు నల్గొండ, వాకిటి శ్రీహరికి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి బాధ్యతను కేటాయించారు. అదే విధంగా ఇప్పటికే ఇంఛార్జ్ మంత్రులుగా కొనసాగు తున్న వారిలోనూ మార్పులు చేసారు. కొందరికి జిల్లాలు మార్పు చేయగా.. మరో ముగ్గురిని ఆ బాధ్యతల నుంచి తప్పిస్తూ నిర్ణయించారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కాగా, మెదక్ జిల్లా కు కొండా సురేఖ, కరీంనగర్ జిల్లా ఇంఛార్జ్ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌లను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. ఇక, ప్రస్తుతం నల్గొండ జిల్లా ఇన్‌చార్జిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావుకు తాజా మార్పుల్లో కరీంనగర్ జిల్లాను, నిజామాబాద్ జిల్లా ఇంఛార్జ్ గా ఉన్న జూపల్లి కృష్ణారావుకు ఆదిలాబాద్, ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జిగా ఉన్న సీతక్కకు నిజామాబాద్ జిల్లాను కేటాయించారు. మొత్తంగా ఉమ్మడి పది జిల్లాలకు ఇంఛార్జ్ లుకా పదిమంది మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. ముందస్తు ఏర్పాట్లతో రండి - తిరుమలకు వచ్చే భక్తులకు టీటీడీ కీలక విజ్ఞప్తి..!! కీలక శాఖల నిర్వహణ లో ఉన్న ఒత్తిడి.. రాజకీయ సమీకరణాలు.. భవిష్యత్ ప్రణాళికలకు అనుగు ణంగా ఈ మార్పులు చేసినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా దామోదర రాజనర్సింహ -మహ బూబ్ నగర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు- రంగారెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి - వరంగల్, పొన్నం ప్రభా కర్ - హైదరాబాద్, డి.అనసూయ (సీతక్క)- నిజామాబాద్, తుమ్మల నాగేశ్వరరావు -కరీంనగర్, జూపల్లి కృష్ణారావు - ఆదిలాబాద్, గడ్డం వివేక్ వెంకటస్వామి- మెదక్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ -నల్గొండ, వాకిటి శ్రీహరికి ఖమ్మం జిల్లా ఇంఛార్జ్ మంత్రులుగా బాధ్యతలు కేటాయించారు.

## కేటీఆర్‌కి మళ్ళీ ఏసీబీ నోటీసులు



**మరో కురుక్షేత్రం, హైదరాబాద్:**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఫార్ములా-ఈ రేసు నిర్వహణ కేసు ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 16వ తేదీ (సోమవారం) ఉదయం 10 గంటలకు తమ ఎదుట విచారణకు హాజరుకావాలని శుక్రవారం జారీ చేసిన నోటీసుల్లో ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు. గతంలో మే 28న విచారణకు రావాలని కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు పంపినప్పటికీ, ఆయన అమెరికా పర్యటనలో ఉండటంతో హాజరు కాలేకపోయారు. తన విదేశీ పర్యటన ముగిసిన అనంతరం విచారణకు అందుబాటులో ఉంటానని ఆయన ఏసీబీకి సమాచారం అందించారు. ఈ విజ్ఞప్తిని ఏసీబీ అంగీకరించడంతో, ఇప్పుడు మరోసారి నోటీసులు జారీ చేసి విచారణకు హాజరుకావాలని ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ వేదికగా ఫార్ములా-ఈ రేసును నిర్వహించారు. ఈ రేసు నిర్వహణలో సుమారు రూ.55 కోట్ల నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపణలు రావడంతో ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా, అప్పటి మున్సిపల్ శాఖ కార్యదర్శి, సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌ను ఏ2గా, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఏ3గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ ఏడాది జనవరిలో కేటీఆర్‌తో పాటు అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ అధికారులు వేర్వేరు తేదీల్లో విచారించి కొంత సమాచారాన్ని సేకరించారు. ఆ సమయంలోనే మరోసారి విచారణకు పిలిచే అవకాశం ఉందని వారికి తెలియజేశారు. వీరితో పాటు గ్రీన్‌కో ఏస్ నెక్స్ట్‌జెన్ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌ను కూడా ఏసీబీ ప్రశ్నించింది. జనవరి విచారణ తర్వాత దాదాపు మూడు నెలల విరామం అనంతరం, ఇప్పుడు కేటీఆర్‌ను రెండోసారి విచారించాలని ఏసీబీ నిర్ణయించింది.

## తెలంగాణలో భారీగా ఐఏఎస్ ఉద్యోగుల బదిలీ

**మరో కురుక్షేత్రం, హైదరాబాద్:**

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అనేక కీలక శాఖలకు సంబంధించి ఐఏఎస్ అధికారుల బదిలీకి వెళ్లింది. తాజాగా 36 మంది అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమార రామకృష్ణరావు గురువారం రాత్రి ఈ బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. కొత్త బాధ్యతలతో పాటు కొన్ని కీలక శాఖలకు అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఇది రాష్ట్ర పరిపాలన వ్యవస్థలో సజావుగా నిర్వహణకు దోహదం చేసేలా ఉంది. ఈ బదిలీలలో భాగంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా ఎన్ శ్రీధర్‌ను నియమించగా, గనుల శాఖకు అదనపు బాధ్యతలు అప్పగించారు. రెవెన్యూ శాఖకు ముఖ్య కార్యదర్శిగా లోకేశ్ కుమార్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇంధనశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న నవీన్ మిట్టల్‌ను బదిలీ చేసి, ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా జ్యోతి బుద్ధ ప్రకాశ్ బాధ్యతలు చేపట్టారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా శశాంక్ గోయల్ నియమితులయ్యారు. కలెక్టర్‌గా హరిచందన దాసరి బాధ్యతలు చేపట్టగా, నిజామాబాద్ కలెక్టర్‌గా టీ. వినయ్ కృష్ణారెడ్డి, సిద్దిపేట కలెక్టర్‌గా కే. హైమావతి, సంగారెడ్డి కలెక్టర్‌గా పీ. ప్రావీణ్య, మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టర్‌గా మిక్కిలినేని మను చౌదరి, ఖమ్మం కలెక్టర్‌గా అనుదీప్ దురిశెట్టి, హనుమకొండ కలెక్టర్‌గా స్నేహ శబరీష్ నియమితులయ్యారు. పౌర సరఫరాల శాఖ డైరెక్టర్‌గా ముజామిల్ ఖాన్ బాధ్యతలు స్వీకరించారు.

**ఇతర శాఖలలో కీలక నియామకాలు**

తెలంగాణ ఆయిల్ ఫెడ్ ఎండీగా జే. శంకరయ్య, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ స్పెషల్ సెక్రటరీగా రాజీవ్ గాంధీ హనుమంతు, స్కూల్




ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా నవీన్ నికోలస్, సమాచార శాఖ కమిషన్ కార్యదర్శిగా భారతి లక్‌పతి నాయక్, ఆర్ అండ్ ఆర్ కమిషనర్‌గా కిల్లు శివకుమార్ నాయుడు, గృహ నిర్మాణ శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా వీపీ గౌతమ్, మత్స్య శాఖ డైరెక్టర్‌గా కే. నిఖిల, పర్యాటకశాఖ ఎండీగా వల్లూరి క్రాంతి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోగా పీ. ఉదయ్ కుమార్, టీజీపీఎస్సీ కార్యదర్శిగా ప్రియాంక ఆల, ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ డైరెక్టర్‌గా వాసం వెంకటేశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు.

**పరిపాలనా దృక్కోణంలో కీలక చర్యగా బదిలీలు**

ఈ బదిలీలు రాష్ట్ర పరిపాలనలో సమతుల్యతను తీసుకురావడంతో పాటు, కొత్త దిశగా పాలనను ముందుకు తీసుకెళ్లేలా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా కొత్తగా బాధ్యతలు స్వీకరిస్తున్న అధికారుల నైపుణ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లా కలెక్టర్లను ప్రాముఖ్యంగా ఎంపిక చేయడం ద్వారా ప్రజలతో పరిపాలన యంత్రాంగానికి దగ్గర సంబంధం ఏర్పడే అవకాశం ఉంది.

## రాష్ట్రంలో మాదకద్రవ్యాలను అంతమొందించాలి : డిజిపి జితేందర్

**మరో కురుక్షేత్రం, హైదరాబాద్:**

డ్రగ్స్ నివారించేందుకు వివిధ రాష్ట్రాల్లో అనుసరిస్తున్న ఏజన్సీలు, యాంటీ నార్కోటిక్ టీమ్స్ నడుమ సమన్వయ సహకారాలు, నిఘాతో సాధ్యమవు తుందని రుజువు చేస్తున్నారని తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ అభిప్రాయపడ్డారు. ఈ మేరకు 'మాదకద్రవ్యాల అక్రమరవాణాను ఎదుర్కొవడం పై హైదరాబాద్ బంజారాహిల్స్ లో తెలంగాణ యాంటీ



నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో డ్రగ్ లా ఎన్ఫోర్స్ మెంట్ ఏజన్సీలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్, గోవా, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహా రాష్ట్రాలతో సహా కేంద్ర, రాష్ట్రాధికారులు, ఏజన్సీ ప్రతినిధులు హజరయ్యారు. డ్రగ్స్ నివారణపై వ్యూహాలు, ప్రణాళికలపై డీజీపీ జితేందర్ వివరించారు. మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతుండడంతో ప్రాంతీయ పరిస్థితులపై దృష్టిసారించాలన్నారు. అదేవిధంగా రాష్ట్ర సరిహద్దులను నిఘాను మరింతంగా పెంచడంతో పాటు మన ఏజన్సీల సమన్వయాన్ని మెరుగుపర్చాలని పేర్కొన్నారు.

## మాజీ సీఎం కేసీఆర్ కు అస్వస్థత .. ఏఐజీ ఆస్పత్రికి తరలింపు



**మరో కురుక్షేత్రం, హైదరాబాద్:**

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మరోసారి అస్వస్థతకు గురయ్యారు. ఆయన్ను హుటాహుటిన గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు వైద్యులు. కేసీఆర్ కు సాధారణ గ్యాస్ట్రిక్ పరీక్షలు నిర్వహించామని డాక్టర్లు తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వైద్యులు వివరించారు. మాజీ సీఎం కేసీఆర్ మరోసారి అనారోగ్యానికి గురయ్యారు. ప్రస్తుతం ఆయన్ను గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. ఆయనతో పాటు మాజీ ఎంపీ సంతోష్ కుమార్, వేముల ప్రశాంత్ రెడ్డి సహా పలువురు నేతలు ఉండనున్నారు. కేసీఆర్ కు వైద్య పరీక్షలు చేశారు. ఏఐజీ ఆస్పత్రిలో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కేసీఆర్ కు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయనకు సాధారణ గ్యాస్ట్రిక్ పరీక్షలు ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు తెలుస్తోంది. కాగా గతంలోనూ పలుమార్లు ఆరోగ్య పరీక్షల నిమిత్తం కేసీఆర్ ఏఐజీ ఆసుపత్రికి వచ్చిన విషయం తెలిసిందే. జూన్ 11న కేసీఆర్ కాళేశ్వరం కమిషన్ ఎదుట హాజరు అయ్యారు. కమిషన్ సంధించిన 18 ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. దాదాపు గంట పాటు ఆయనను విచారించింది జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్. జూన్ 11న ఉదయం 11 గంటల 30 నిమిషాలకు విచారణ ప్రారంభం అయింది. ఆ సమయంలోనే కేసీఆర్ స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన విజ్ఞప్తి మేరకు ఇన్ కెమెరా విచారణకు జస్టిస్ ఘోష్ కమిషన్ అంగీకరించింది. సుమారు గంటపాటు ఆయన్ను కమిషన్ ప్రశ్నించింది. 18 ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది.

# కూల్చారం పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్.పి .డి.వి. శ్రీనివాస రావు

## విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తప్పవు
## నిరంతరం వాహన తనిఖీలు చేసి రోడ్డు ప్రమాద నివారణకు కృషి చేయాలి
## సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహనా కల్పించాలి



మెదక్, మరో కురుక్షేత్రం: ఈ రోజు జిల్లా ఎస్పీడి.వి. శ్రీనివాస రావు ఐ.పి.ఎస్ కూల్చారం పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అక్కడి పోలీస్ సిబ్బంది నిర్వహిస్తున్న విధులను ఎస్.ఐ గౌసోద్దీన్ జిల్లా ఎస్.పి డి.శ్రీనివాస రావు ను వివరించారు. పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించే సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సిబ్బంది యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిదప పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిసి కెమెరాలు, సిబ్బంది పని తీరును పరిశీలించడంతో పాటు పెండింగ్లో తీవ్రమైన నేరాల సి.డి ఫైల్స్, స్థిరాస్థి చోరీలు, ఐటీ కేసుల ప్రస్తుత స్థితిగతులపై రికార్డులను తనిఖీ చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో కల నేర ప్రవృత్తి కల వారిని ప్రతి రోజు తనిఖీ చేయాలని, అలాగే ఆస్తి నేరాలకు పాల్పడే వారిపై నిఘా పెట్టాలని, పోలీస్ స్టేషన్ల పరిధిలో తిరిగే అనుమానితుల సమాచారాన్ని సేకరించాలని సిబ్బంది అంకితభావంతో విదులు నిర్వర్తించాలని కష్టంలో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు పోలీసులు స్వాంతన చేకూర్చాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తిస్తూ వారి ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. అలాగే ప్రజలు వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నియామాలు పాటించాలని తాగి వాహనాలు నడపవద్దని అన్నారు. అలాగే బ్లూ కోట్స్, పెట్రో కార్స్ నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని మరియు డయల్ 100 కాల్స్ వచ్చిన వెంటనే తక్షణమే స్పందించి సంఘటన స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్.పి స్టేషన్ అధికారులకు , సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీస్పీ ప్రసన్న కుమార్ మరియు ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

# 200 యుద్ధ విమానాలు.. 330 బాంబులు..
## వీడియో రిలీజ్ చేసిన ఇజ్రాయిల్ మిలిటరీ



టెహ్రాన్ : ఇజ్రాయిల్‌పై ప్రతీకార దాడికి దిగింది ఇరాన్. సుమారు వంద డ్రోన్లతో ఇరాన్ అటాక్ చేసినట్లు ఇజ్రాయిల్ పేర్కొన్నది. ఆ దాడులను తిప్పికొట్టేందుకు సన్నద్ధం అయినట్లు ఇజ్రాయిల్ తెలిపింది. శుక్రవారం తెల్లవారుజామున ఇరాన్‌పై ఇజ్రాయిల్ ఆకస్మిక దాడికి పాల్పడింది. అణ్వాయుధ కేంద్రాలు, అణు శాస్త్రవేత్తలను, సీనియర్ మిలిటరీ వ్యక్తులను ఇజ్రాయిల్ టార్గెట్ చేసింది. అయితే తమ ఆపరేషన్ సక్సెస్ అయినట్లు ఇజ్రాయిల్ వెల్లడించింది. అణ్వాయుధులను ఇరాన్ డెవలప్ చేస్తున్నట్లు ఇజ్రాయిల్ ఆరోపించింది. ఇజ్రాయిల్ వైమానిక దళానిక చెందిన యుద్ధ విమానాల వీడియోను ఐడీఎఫ్ రిలీజ్ చేసింది. ఇరాన్‌పై జరిగిన దాడుల్లో సుమారు 200 ఐఏఎఫ్ విమానాలు పాల్గొన్నట్లు ఇజ్రాయిల్ మిలిటరీ చెప్పింది. ఆ ఫైటర్ విమానాలు సుమారు 330 బాంబులను జార విడిచాయి. సుమారు వంద ప్రదేశాల్లో వాటిని పేల్చినట్లు ఇజ్రాయిల్ పేర్కొన్నది. ఇజ్రాయిల్ విమానాలకు చెందిన వీడియోను రిలీజ్ చేశారు. ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు ఇజ్రాయిల్‌కు చేరుకునేందుకు కొన్ని గంటల సమయం పట్టనున్నది.

# ఇరాన్ గగనతలం మూసివేత..
## విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం

పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు కమ్ముకున్నాయి. ఇజ్రాయెల్ వైమానిక దళం ఇరాన్‌పై ముందస్తు దాడులకు దిగింది. అణు కర్మాగారాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురిపించింది. శుక్రవారం ఉదయం దేశ రాజధానిలో పేలుళ్ల శబ్ధం వినిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారని ఇరాన్ అధికార మీడియా వెల్లడించింది. దీనికి ప్రతిగా టెహ్రాన్ సైతం ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులకు దిగింది. డ్రోన్లతో విరుచునుపడుతోంది. ఈ దాడులను ఇజ్రాయెల్ సమర్ధవంతంగా తిప్పికొడుతోంది.

ఇక ఇజ్రాయెల్ దాడులతో అప్రమత్తమైన ఇరాన్ తన గగనతలాన్ని మూసి వేసిన విషయం తెలిసిందే. దీంతో విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. న్యూయార్క్ నుంచి ఢిల్లీకి, ఢిల్లీ, ముంబై నుంచి లండన్, న్యూయార్క్‌కు వెళ్లే అనేక విమానాలు ప్రభావితమయ్యాయి. పలు విమానాలను దారిమళ్లించగా.. మరికొన్ని వెనక్కి తిరిగివస్తున్నాయి. దాదాపు 16 ఎయిర్ ఇండియా విమానాలను దారి మళ్లించినట్లు ఎయిర్‌లైన్స్ తెలిపింది.



# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రిగా నియమితులైన జూపల్లి కృష్ణారావు గారిని కలసిన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



( తెలంగాణ బ్యూరో అహ్మద్ బిన్ మొహమ్మద్ )

హైదరాబాద్ లో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి, ఇటీవల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రిగా నియమితులైన జూపల్లి కృష్ణారావు గారిని వారి కార్యాలయంలో ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ గారు మర్యాద పూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

# ఈ నెల 16వ తేదీన వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరగనున్న రైతునేస్తం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లను చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు అధికారులను ఆదేశించారు



మెదక్, మరో కురుక్షేత్రం: శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

మెదక్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా వ్యవసాయ అధికారి, వినయ్, పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గౌరవ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖి మాట్లాడతారని, ఆ ప్రసారాన్ని అన్ని రైతునేస్తం కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారని కలెక్టర్లకు తెలిపారు. ప్రతినిధులను ఆహ్వానించి, ప్రతి ప్రాంతం నుంచి కనీసం 250 మంది రైతులు హాజరయ్యేలా చూసి, కార్యక్రమాన్ని సముచితంగా నిర్వహించాలని కలెక్టర్లను ఆయన కోరారు.

ఈ కార్యక్రమం ద్వారా రైతులు వ్యవసాయ నిపుణులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు 500 కేంద్రాల్లో అందుబాటులో ఉన్న వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని విస్తరించి, ఈ నెల 16 నుండి అదనంగా మరో 1000 కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈ సదుపాయం ద్వారా నిపుణులు ఏ పంటలు వేసుకోవాలి, ఆధునిక సాగు విధానాల గురించి రైతులకు తరచూ సూచనలు ఇస్తారని సీఎస్ చెప్పారు.

వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం కోసం ప్రతి రైతునేస్తం కేంద్రంలో సంబంధిత క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారితో పాటు మండల స్థాయి అధికారిని నియమించాలని కలెక్టర్లను కోరారు. కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని ఆయన సూచించారు.

# ఇరాన్‌పై ఇజ్రాయెల్ వార్..
## ముడి చమురు ధరలకు రెక్కలు!



ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లలో తీవ్ర ప్రకంపనలు సృష్టించాయి. ఇవాళ తెల్లవారుజామున ఇరాన్‌లోని కొన్ని లక్ష్యాలపై ఇజ్రాయెల్ సైనిక దాడి చేయడంతో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ఈ పరిణామం ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరా భద్రతపై తీవ్ర ఆందోళనలకు దారితీసింది.

**ఇంధన ధరలు, ద్రవ్యోల్బణం మీద ప్రభావం**

మార్కెట్ విశ్లేషకుల సమాచారం ప్రకారం, ఈ దాడి వార్త వెలువడిన కొన్ని గంటల్లోనే బ్రెంట్ ముడి చమురు ఫ్యూచర్స్ ధరలు 4 శాతానికి పైగా పెరిగాయి. ఈ ధరలు 2024 ప్రారంభంలో నమోదైన గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయని నిపుణులు తెలిపారు. మధ్యప్రాచ్యంలో ముఖ్యంగా ఇంధన సంపన్న ప్రాంతాలలో ఏ చిన్న భౌగోళిక, రాజకీయ అస్థిరత ఏర్పడినా అది ప్రపంచ చమురు సరఫరాపై ఎంత తీవ్ర ప్రభావం చూపుతుందో ఈ ఘటన స్పష్టం చేస్తోంది. ఇరాన్ (%×తీఘఅ%) ప్రపంచంలోనే అతిపెద్ద చమురు ఎగుమతిదారులలో ఒకటి కావడం, ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణాకు కీలకమైన హార్ముజ్ జలసంధి ఈ ప్రాంతంలో ఉండటంతో ఇక్కడ జరిగే ప్రతి పరిణామాన్ని వ్యాపారులు, విధాన రూపకర్తలు నిశితంగా గమనిస్తున్నారు.

**గ్లోబల్ మార్కెట్లకు షాక్**

గ్లోబల్ ఎనర్జీ కన్సల్టెంట్స్‌కు చెందిన కమోడిటీస్ విశ్లేషకుడు మహేశ్ పటేల్ మాట్లాడుతూ "ఇరాన్ నుంచి చమురు ఎగుమతులు తగ్గినా లేదా హార్ముజ్ జలసంధి ద్వారా రవాణాకు అంతరాయం కలిగినా సరఫరా తగ్గి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది" అని అన్నారు. ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే లేదా మరిన్ని సైనిక చర్యలు జరిగితే ఇంధన మార్కెట్లలో మరింత అస్థిరతకు దారితీస్తుందని ఇంధన నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే భారత్ సహా పలు దేశాలు తమ దేశాల్లో ఇంధన ధరలు, ద్రవ్యోల్బణంపై దీని ప్రభావం ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశాయి.

**ఐఈఏ, ఐఎంఎఫ్ సంయమన పిలుపు**

ఈ ఆకస్మిక ధరల పెరుగుదల నేపథ్యంలో అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) సంయమనం పాటించాలని పిలుపునిచ్చింది. అవసరమైతే మార్కెట్‌ను స్థిరీకరించడానికి సభ్య దేశాలు తమ వ్యూహాత్మక నిల్వలను విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నాయని ఐఈఏ ఒక ప్రకటనలో తెలిపింది. మరోవైపు పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారకుండా విస్తృత ప్రాంతీయ సంఘర్షణను నివారించడానికి దౌత్యపరమైన పరిష్కారాలను కనుగొనాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న విధాన రూపకర్తలు కోరుతున్నారు.



**భవిష్యత్తుపై అంచనాలు**

ఇజ్రాయెల్ మరో దాడికి సిద్ధమవుతే, చమురు ధరలు మరింత పెరుగుతాయి. హార్ముజ్ జలసంధి మూత పడితే ప్రపంచ మార్కెట్లు గందరగోళానికి గురవుతాయి. డాలర్ బలపడటం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ విధానాలకు కూడా ఇది ప్రభావం చూపే అవకాశం. ఈ పరిణామాలు సుస్థిరంగా కొనసాగితే గ్లోబల్ చమురు మార్కెట్లే కాదు, సామాన్య ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతారు. ఇది గట్టి హెచ్చరిక. రాజకీయంగా, ఆర్థికంగా ప్రపంచం ఎంత అనుసంధానమైపోయిందో మరోసారి నిరూపించబడింది.

## విమాన ప్రమాద మృతులకు సంతాపం..
# లార్డ్స్‌లో నల్లరిబ్బన్లు ధరించిన క్రికెటర్లు






అహ్మదాబాద్ విమాన ప్రమాదం పలు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. లండన్‌కు బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన నిమిషాల్లోనే చెట్టును ఢీకొని.. సమీపంలోని వైద్య కళాశాల హాస్టల్ భవనంపై కూలింది. యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిన ఈ ఘటనపై పలు దేశాల నాయకులు సంతాపం తెలియజేశారు. లార్డ్స్ మైదానంలో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఆడుతున్న ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా ఆటగాళ్లు సైతం సంతాపం తెలిపి.. నల్ల రిబ్బన్లు ధరించారు.

గురువారం మధ్యాహ్నం అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా బోయింగ్ 787–8 డ్రీమ్ లైనర్ విమాన ప్రమాదం 241 మందిని పొట్టనబెట్టుకుంది. ఈ నేపథ్యంలో డబ్ల్యూటీసీ ఫైనల్ మూడో రోజు ఆసీస్, సఫారీ ఆటగాళ్లు మృతులకు సంతాపం తెలిపారు. తొలి సెషన్ ప్రారంభానికి ముందు ఇరుజట్ల ఆటగాళ్లు, స్టేడియంలోని ప్రేక్షకులు అందరూ నిల్చొని నిమిషం సేపు మౌనం పాటించారు.

ఆ తర్వాత భుజానికి నల్ల రిబ్బన్లు(%దీశ్రీఖఎని =అఎఎశీఅం%) కట్టుకొని మైదానంలోకి దిగారు దక్షిణాఫ్రికా ప్లేయర్లు. ఇంగ్లండ్ పర్యటనలో ఉన్న భారత క్రికెటర్లు సైతం మృతుల కుటుంబాలకు సంఘీ భావం తెలుపుతూ ఒక నిమిషం పాటు మౌనం పాటించారు. ఆతిథ్య జట్టుతో ఐదు టెస్టుల సిరీస్ ఆడనున్న టీమిండియా శుక్రవారం ఇంట్రా స్క్వాడ్‌తో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది.

**24 మంది మెడికోలు**

గురువారం మధ్యాహ్నం ఎయిరిండియా బోయింగ్ 787–8 విమానం లండన్‌కు బయల్దేరింది. అందులో 169 మంది భారతీయులు, 53 మంది బ్రిటీషర్లు, 8 మంది పోర్చుగల్ దేశస్థులు సహా కెనడాకు చెందిన ఒకరు అయితే.. టేకాఫ్ అయిన 2–3 నిమిషాల్లోనే చెట్టును ఢీకొని సమీపంలోని వైద్య కళాశాల వసతి గృహం భవంతిమీద పడిపోయింది. అనంతరం భారీ పేలుడుతో విమానం తునాతునకలైంది. ఈ ఘటనలో వైద్య కళాశాలలోని 24 మంది మెడికోలు ప్రాణాలు విడిచారు.

యావత్ ప్రపంచాన్నిఉలిక్కిపడేలా చేసిన ఈ ప్రమాదంలో ఒకేఒక్కడు మృత్యుంజయుడిలా బయటపడ్డాడు. శవాల దిబ్బగా మారిన ఘటనా స్థలం నుంచి రమేశ్ విశ్వకుమార్ అనే 38 ఏళ్ల వ్యక్తి నడుచుకుంటూ అంబులెన్స్ వరకూ వెళ్లాడు. ప్రస్తుతం అతడికి చికిత్స అందిస్తున్నారు. ఊహించుకోవడానికే వణుకు పుట్టే ఈ ప్రమాదంలో రమేశ్ ప్రాణాలతో ఉండడం నిజంగా అద్భుతం.

## లార్డ్స్‌లో 282.. ఛేజింగ్ జట్టును రెండుసార్లే
# వరించిన విజయం..!

ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది ఆస్ట్రేలియా. టెస్టు గదను వశం చేసుకునేందుకు సిద్ధమవుతున్న సఫారీలు 282 రన్స్ కొడితే చరిత్ర సృష్టిస్తారు. తొలిసారి ఐసీసీ ఫైనల్లో విజేతగా కొత్త అధ్యాయాన్ని లిఖిస్తారు. అయితే.. ఛాంపియన్ ట్యాగ్ కల సాకారం కావాలంటే లార్డ్స్ మైదానంలో దక్షిణాఫ్రికా బ్యాటర్లు అద్భుతంగా ఆడాల్సిందే. కానీ, లార్డ్స్‌లో ఇప్పటివరకూ 280 ప్లస్ లక్ష్య ఛేదన రెండుసార్లు మాత్రమే సాధ్యమైంది. రికార్డులు అనుకూలంగా లేనప్పటికీ ఈ సీజన్‌లో తెంబ బవుమా జట్టు భీకర ఫామ్‌లో ఉంది. ఈ మధ్యే 250 ప్లస్ లక్ష్యాన్ని ఐదుసార్లు సునాయసంగా చేరుకుంది. వీటిలో మూడు ఆస్ట్రేలియాపైనే కావడం విశేషం.






**414 రన్స్ కొట్టి**

పెర్త్ మైదానంలో 2008లో 414 రన్స్ కొట్టి ఆతిథ్య జట్టుకు షాకిచ్చింది సఫారీ టీమ్. సో.. డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆసీస్ నిర్దేశించిన 282 రన్స్ కొట్టడం ఏమంత కష్టం కాకపోవచ్చు. ఎందుకంటే.. టాపార్డర్ నుంచి లోయర్ ఆర్డర్ వరకూ బ్యాట్ ఝులిపించగల ఆటగాళ్లు ప్రస్తుతం జట్టులో ఉన్నారు. కంగారూ బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్ మీద టెయిలెండర్లు ఏమాత్రం కష్టపడకుండా పరుగులు సాధించగా.. వరల్డ్ క్లాస్ బ్యాటర్లున్న ప్రొటీస్ టీమ్ టెస్టు గదను ముద్దాడడం సాధ్యమే అనిపిస్తోంది.

లార్డ్స్‌లో అత్యధిక ఛేదన రికార్డు వెస్టిండీస్ పేరిట ఉంది. 1984లో ఇంగ్లండ్ నిర్దేశించిన 342 పరుగుల లక్ష్యాన్ని విండీస్ ఒకే ఒక వికెట్ కోల్పోయి ఛేదించింది. 2022లో న్యూజిలాండ్ 277 పరుగుల లక్ష్యాన్ని 5 వికెట్ల కోల్పోయి ఛేదించింది. అయితే.. 2004లో న్యూజిలాండ్ 282 పరుగులను అందుకోలేక మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. 1965లో కివీస్ 216 టార్గెట్‌ను సునాయసంగా పూర్తి చేసింది. 2012లో వెస్టిండీస్ 191 పరుగులను విజయవంతంగా ఛేదించి ఇంగ్లండ్‌కు షాకిచ్చింది.

**రబడ విజృంభణ.. స్టార్క్ ఫిఫ్టీ**

తొలి రోజు నుంచి ఊహించని మలుపులతో ఆసక్తి రేపుతున్న ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ క్లైమాక్స్‌కు చేరింది. రెండు రోజులుగా ఆధిపత్యం చేతలు మారుతూ వచ్చిన పోరులో విజేత ఎవరో తేలిపోనుంది. తొలి ఇన్నింగ్స్‌లో 74 పరుగుల ఆధిక్యం సాధించిన ఆస్ట్రేలియా.. రెండో ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్‌తో మ్యాచ్‌పై పట్టు బిగించింది. సఫారీ పేసర్లు కగిసో రబడ(4–59), లుంగి ఎంగిడి(3–38)ల ధాటికి ప్రధాన బ్యాటర్లు పెవిలియన్ చేరినా.. వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ(43), మిచెల్ స్టార్క్(58 నాటౌట్)ల అసమాన పోరాటంతో జట్టును ఆదుకున్నారు.

**మిచెల్ స్టార్క్ (58 నాటౌట్)**

సఫారీ పేసర్లకు ఎదురొడ్డిన ఈ జోడీ రెండో పట్టుదలగా ఆడింది. మూడో రోజు లియన్(2)ను రబడ ఔట్ చేశాక హేజిల్‌వుడ్(17) జతగా స్టార్క్ ప్రత్యర్థి బౌలర్లను విసిగించాడు. అజేయ అర్ధ శతకం బాదిన ఈ స్పీడ్‌స్టర్ పదో వికెట్‌కు 59 రన్స్ రాబట్టాడు. మరికాసేపట్లో లంచ్ అనగా ఈ ద్వయాన్ని.. మర్క్‌రమ్ విడదీశాడు. దాంతో, 207 వద్ద కంగారూ జట్టు ఇన్నింగ్స్ ముగిసింది. తొలిసారి ఐసీసీ ట్రోఫీ కోసం నిరీక్షిస్తున్న దక్షిణాఫ్రికాకు విజయం కోసం 282 పరుగులు అవసరం. బ్యాటింగ్‌కు అనుకూలిస్తున్న పిచ్ మీద సఫారీ బ్యాటర్లు నింపాదిగా ఆడితే టెస్టు గదను ముద్దాడడం సాధ్యమేనంటున్నారు విశ్లేషకులు.



# ఓటీటీలోకి వచ్చేసిన ‘రానా నాయుడు 2’..



విక్టరీ వెంకటేష్, రానా దగ్గుబాటి ప్రధాన పాత్రల్లో నటించిన ‘రానా నాయుడు’ వెబ్ సిరీస్ సీజన్ 2 తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది. తెలుగుతో పాటు హిందీ, తమిళ, కన్నడ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ వేదికగా అందుబాటులో ఉంది. అమెరికన్ సిరీస్ రే డోనవన్‌కి రీమేక్‌గా వచ్చిన ఫస్ట్ సీజన్ మంచి విజయాన్ని అందుకుంది. దీంతో దీనికి కొనసాగింపుగా రెండో సీజన్‌ను తీసుకువచ్చారు మేకర్స్. కరణ్ అంశుమాన్, సుపర్ణ్ ఎస్. వర్మ సంయుక్తంగా దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్‌లో సుర్వీన్ చావ్లా, సుశాంత్ సింగ్, అభిషేక్ బెనర్జీ, గౌరవ్ చోప్రా, ప్రియ బెనర్జీ, రాజేష్ జైస్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

# ప్రభాస్ ‘రాజా సాబ్’ టీజర్ లీక్..




పాన్ ఇండియా నటుడు ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం రాజా సాబ్ టాలీవుడ్ డైరెక్టర్ భలే భలే మొగాడివోయ్ ఫేమ్ మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా నుంచి టీజర్ విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. జూన్ 16న టీజర్ విడుదల చేయనున్నారు మేకర్స్. అయితే టీజర్ రాకముందే దీనికి లీకుల బెడద మొదలైంది. ఈ టీజర్‌లోని కొన్ని సన్నివేశాలు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో లీక్ అయినట్లు తెలుస్తుంది. దీంతో ఈ విషయంపై చిత్రబృందం తాజాగా స్పందిస్తూ.. నెటిజన్లకు హెచ్చరిక జారీ చేసింది. ఎవరైనా ‘రాజాసాబ్’ కంటెంట్‌కు సంబంధించిన అనధికారిక వీడియోలు, ఫొటోలు షేర్ చేస్తే, వారి సోషల్ మీడియా అకౌంట్‌ను తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. సినిమాటిక్ అనుభూతిని అందించడానికి చిత్రబృందం ఎంతో కష్టపడుతోందని, దీనికి అందరూ సహకరించాలని కోరింది.

# ఏంటి.. నిహారిక సైలెంట్‌గా నిశ్చితార్థం చేసుకుందా..




మెగా డాటర్ ముద్దుల కూతురు నిహారిక గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. యాంకర్‌గా అదరగొట్టిన నిహారిక ఆ తర్వాత నటిగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంది.కొణిదెల నిహారిక 2015 నుంచి తెలుగు చిత్ర పరిశ్రమలో యాక్టివ్ గా ఉంటోంది. ఒక మనసు చిత్రంతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత హ్యాపీ వెడ్డింగ్, సూర్యకాంతం, సైరా నర్సింహ రెడ్డి, డార్లింగ్, వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. కానీ ఈ అమ్మడు నటించిన ఏ చిత్రం కూడా బ్లాక్ బాస్టర్ హిట్స్ ను అందుకోలేకపోయింది. మరోవైపు పలు వెబ్ సిరీస్ ల్లోనూ నటించినా పెద్దగా ఫలితం లేకుండా పోయింది. డెడ్ పిక్సెల్స్, బెంచ్ లైఫ్ వంటి సిరీస్ ల్లో నటించిన కూడా సక్సెస్ అందుకోలేకపోయింది ఇక నిర్మాతగా తన అదృష్టం పరీక్షించుకునేందుకు సిద్ధమైన ఈ ముద్దుగుమ్మ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ లో నిర్మించిన కమిటీ కుర్రాళ్లు చిత్రంతో బ్లాక్ బాస్టర్ హిట్ ను సొంతం చేసుకుంది. రూ.10 కోట్లతో నిర్మించిన ఈ చిత్రానికి రూ.25 కోట్ల గ్రాస్ కలెక్ట్ అయ్యింది. ఇక తెలుగులో మనోజ్ నటిస్తోన్న ”వాట్ ది ఫిష్” అనే సినిమాలో నిహారిక హీరోయిన్‌గా ఎంపికైంది. ఈ సినిమా అతి త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా నిహారికకు సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. నిహారిక సీక్రెట్‌గా నిశ్చితార్థం చేసుకుందని, త్వరలోనే రెండో పెళ్లి చేసుకోనుందంటూ ప్రచారం ఊపందుకుంది. నిహారిక కొణిదెల తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేసిన ఒక ఫొటో ప్రస్తుతం అభిమానుల దృష్టిని ఆకర్షిస్తోంది. ఆ ఫొటో చూస్తుంటే ఏదో శుభకార్యం, పూజ లేదా నిశ్చితార్థం వంటి వేడుకకు సంబంధించినదిగా కనిపిస్తోంది. ఈ ఫొటోలో నిహారిక పట్టుచీర ధరించి సంప్రదాయబద్ధంగా కనిపించారు. ఆ ఫొటో చూస్తే నిహారిక నిశ్చితార్థం చేసుకున్నదనే చర్చ నడుస్తోంది. పూర్తి ఫొటో పోస్టు చేయకుండా కేవలం చేయి.. పూలు కనిపించేలా షేర్ చేసి నెటిజన్ల మెదడుకు పదును పెట్టింది. అది కచ్చితంగా నిశ్చితార్థం ఫొటో అని కొందరు కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం పిక్ నెట్టింట వైరల్ అవుతుంది. అలానే నిహారిక నిశ్చితార్థం న్యూస్ కూడా వైరల్‌గా మారింది.

## కూలీలో నన్ను నేను చూసుకుని షాక్ అయ్యాను: నాగార్జున



టాలీవుడ్ అగ్ర కథానాయకుడు నాగార్జున ప్రస్తుతం రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఇప్పటికే ‘కుబేర’ విడుదలకు సిద్ధం కాగా.. మరోవైపు ఆయన నటించిన ‘కూలీ’ చిత్రం కూడా ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు సినిమాలకు సంబంధించి తాజాగా ఆసక్తికర విషయాలను పంచుకున్నారు నాగార్జున. ఒక ఇంటర్వ్యూలో నాగార్జున మాట్లాడుతూ.. దర్శకుడు శేఖర్ కమ్ముల అంటే తనకెంతో అభిమానమని తెలిపారు. తనతో 15 ఏళ్లుగా సినిమా చేయాలని చూస్తున్నాను. ‘కుబేర’తో ఆ కల నెరవేరింది. శేఖర్ చిత్రాలు మిగతా సినిమాలకంటే చాలా భిన్నంగా ఉంటాయి. అయితే ‘కుబేర’ కథతో నా దగ్గరికి వచ్చినప్పుడు నేను షాక్ అయ్యాను. శేఖర్ నువ్వు నిజంగానే ఈ సినిమా చేయాలనుకుంటున్నావా?’ అని అడిగాను. అప్పుడు శేఖర్ అవును అని తెలిపాడు. ‘కుబేర’ కోసం శేఖర్ ఎంతో రీసెర్చ్ చేశాడు. ఈ సినిమాలో ఆయన చెప్పిన కొన్ని ఆసక్తికర విషయాలు విని నేనే షాక్ అయ్యాను.

# చార్మింగ్ అదితి..



అదితి శంకర్.. హీరోయిన్, నేపథ్య గాయని. ఎక్కువగా తమిళ చిత్రాలలో పని చేస్తుంది. తరుచూ సామజిక మాధ్యమాల్లో యాక్టివ్ గా ఉంటూ తన అభిమానులను ఖుషి చేస్తుంది ఈ వయ్యారి భామ. తాజాగా ఈ బ్యూటీ సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. ఈ ఫోటోలను చూసిన కుర్రాళ్లు వీటికి లైక్స్ కొడుతూ వైరల్ చేస్తున్నారు. ఆ ఫోటోలపై మీరు కూడా ఓ లుక్కెయ్యండి. 6 జూలై 1997న తమిళనాడు రాజధాని చెన్నైలో జన్మించింది. ఆమె భారతీయ చలనచిత్ర నిర్మాత ఎస్. శంకర్ కుమార్తె. ఆమెకు ఒక అక్క, ఐశ్వర్య శంకర్ మరియు ఒక తమ్ముడు, అర్జిత్ శంకర్ కూడా ఉన్నారు. శ్రీరామచంద్ర యూనివర్సిటీలో మెడికల్ డిగ్రీ పూర్తి చేసింది ఈ ముద్దుగుమ్మ. గ్రాడ్యుయేషన్ తర్వాత ఆమె తన తల్లిదండ్రులకు కారణంగా నటన పట్ల ఇష్టాన్ని పెంచుకొని హీరోయిన్ గా సినిమాల వైపు అడుగులు వేసింది. 2022లో శివకార్తికేయన్ సరసన తమిళ మసాలా చిత్రం విరుమాన్ సినిమాతో కథానాయకిగా చలనచిత్ర అరంగేట్రం చేసింది. ఈ సినిమాలో ఈ వయ్యారి నటనకి ఉత్తమ తొలి నటిగా %వా××వీూ% అవార్డు గెలుచుకుంది. ఇది తెలుగులో మహావీరుడిగా విడుదలైంది. 2022లో వరుణ్ తేజ హీరోగా తెలుగు స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా చిత్రం గనిలో థమన్ మ్యూజిక్ అందించిన “రోమియో జూలియట్” అనే పాట ఆలపించింది. మహావీరుడు (డి) “బంగారుపేటలోన” అని మరో తెలుగు పాట పడింది. ఈ ఏడాది భైరవం సినిమాతో తెలుగులో అరంగేట్రం చేసింది ఈ సుకుమారి. ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. వన్స్ మోర్ అనే ఓ తమిళ చిత్రంలో కూడా నటిస్తుంది. ఈ చిత్రీకరణ పూర్తయింది. ఇది త్వరలోనే విడుదల కానుంది.

PRINTED,PUBLISHED , OWNED BY **Dr. SHAIK ISLAMUDDIN** ,PRINTED AT ARUNODAYA NOTEBOOK MANUFACTURERS PRIVATE LIMITED, D.NO. 33-5-9, PAPAIAH STREET, SEETHA RAMA PURAM, VIJAYAWADA-520002, A.P. PUBLISHED FROM 2-6-60 AND 2-6-60/A/1 FLAT NO. 101, AKBAR HILLS, CHINTALMET, VTC: RAJENDRANAGAR, PO: RAJENDRANAGAR, DISTRICT: K.V. RANGAREDDY, TELANGANA - 500030 P.H: 94414 22806 ,EMAIL: dr.islamuddin12@gmail.com , EDITOR: **Dr. SHAIK ISLAMUDDIN**